క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



వెంకటాపురం(ఎం): మండలంలోని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బాషబోయిన పోశాలు శుక్రవారం మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువా కప్పి పోశాలును మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, కాంగ్రెస్ నాయకులు మిల్కూరి అయిలయ్య, జంగిలి రవి, బానోతు భాస్కర్, చెన్నోజు శ్రీనివాస్, బోయిని సుధాకర్, సుమన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ రేగ కేశవరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెఫ్టీ, సెక్యూరిటీ గైడ్స్‌లో భాగంగా ఆయన పాఠశాలలోని విద్యార్థినులకు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా, సెక్యూరిటీ ఎలా ఉందని పరిశీలించారు. విద్యార్థినుల అటెండెన్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అలాగే విద్యార్థినులకు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ గైడ్‌లైన్స్‌పై ఎంఈఓ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. వారి వెంట కేజీబీవీ స్పెషలాఫీసర్ ఇర్ప పుష్పనీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామకం

కాటారం: మండలంలోని రేగులగూడెం అఖిల భారత యాదవ సంఘం మహాసభ నూతన గ్రామ కమిటీ శుక్రవారం నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా గడ్డం కొమురయ్య, అధ్యక్షుడిగా ఎల్లవేన రవి, ఉపాధ్యక్షుడిగా కాటవేన శివ, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా సంపత్, కార్యవర్గ సభ్యులుగా మల్లయ్య, మల్లేశ్, గట్టయ్య, పర్వతాలు, ప్రకాశ్, రాజయ్య ఎన్నికయ్యారు.

స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేయాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులకు దీపావళి సందర్భంగా స్వీట్ బాక్స్‌లను పంపిణీ చేయాలని సీఐటీయూ బ్రాంచీ కార్యదర్శి కంపేటి రాజయ్య ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ జాతీయ కార్మిక సంఘాలు యాజమాన్యంతో ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతీ విషయంలో రాజకీయంగా ముడిపెట్టడం యాజమాన్యానికి పరిపాటిగా మరిందన్నారు. వంద శాతం ఉత్పత్తిని సాధించినందరకు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు బాధ్యతగా తీసుకొని కార్మికులందరికీ స్వీట్ బాక్స్‌లు ఇప్పించాలని కోరారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

కాటారం: మండలంలోని గంగారం శివారు మానేరు వాగులో శుక్రవారం గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళ మృతదేహం వాగులో నీటి ప్రవహానికి కొట్టుకు వచ్చి ఇసుకపై ఆగిపోయింది. పొలం పనుల నిమిత్తం వెళ్లిన స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై మ్యాక అభినవ్ వివరాలు నమోదు చేసుకున్నారు. రెండు, మూడు రోజుల క్రితం మహిళ నీటిలో పడిపోయి ఇటువైపుగా కొట్టుకువచ్చినట్లు పోలీసులు భావిస్తున్నారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం


వెంకటాపురం(కె): ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


వాజేడు: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు. మండల పరిధిలోని కొత్తగుంపు, చిన్న గంగారం, గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి ఇంట్లో ఎంత మంది కుటుంబ సభ్యులు ఉంటున్నారు, ఎవరైన జ్వరంతో బాధ పడుతున్నారా అనే విషయాలను సర్వే చేశారు. అనంతరం గ్రామాల్లో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వైద్యాధికారులు మహేందర్, పవన్, జ్యోతి, పీహెచ్‌ఎన్ యాకలక్ష్మి, డీపీఎంఓ సత్యనారాయణ ఉన్నారు.

వాజేడు: ప్రజలు ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలని ప్రగళ్లపల్లి పల్లె దవఖాన వైద్యురాలు గ్యానస, మాతా శిశు సంరక్షణ వైద్యురాలు యోషిత అన్నారు. మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 30 సంవత్సరాలు పైబడ్డ వారిని గుర్తించి రక్తపోటు, మధుమేహం నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా మందులను వాడాలని సూచించారు. అలాగే ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, శ్రీను, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో పోలీస్ సేవలు


సమస్యలు తెలుసుకుంటున్న సీఐ శ్రీనివాస్


కళాశాలలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

ఏటూరునాగారం: ప్రజలకు నిత్యం అందుబాటులో పోలీస్ సేవలు ఉంటాయని సీఐ అనుముల శ్రీనివాస్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని రొయ్యూరులో గ్రామలస్తులతో కలిసి గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఓ వికలాంగుడికి పోలీస్ శాఖ తరుపున వీల్ చైర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పిల్లలు ఇబ్బందులకు గురిచేయకుండా వారి బాగోగులు చూడాలని తెలిపారు. ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, పోలీసుల ప్రతిభ, త్యాగాలను వివరించారు. అలాగే ఏటూరునాగారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో విచ్చలవిడి మొబైల్ వాడకంపై అవగాహన కల్పించారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని, ఇందుకు యువత పోత్సాహం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తాజుద్దీన్, గ్రామస్తులు, కళాశాల ప్రిన్సిపాల్ రేణుక, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల కోసం ప్రయత్నం!

మంగపేట: మండంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తమ చేతుల్లోకి తీసుకునేందుకు పలువురు ఫర్టీలైజర్ షాపుల యజమానులు, ధాన్యం వ్యాపారులు కసరత్తు చేస్తున్నారు. మండలంలో రైతులు పండించిన ధాన్యం స్థానికంగా కొనుగోలు చేసేందుకు ఐకేపీ(సెర్ప్), మంగపేట ఎఫ్‌ఎస్‌సీఎస్, గిరిజన సహకార సంస్థ, మ్యాక్స్ సొసైటీ, ఓడీసీఎంఎస్, ఆధ్వర్యంలో ప్రతీ ఏటా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న విషయం విధితమే. కాగా, ధాన్యం వ్యాపారులతో పాటు, మరికొందరు ఫర్టీలైజర్స్, పెస్టిసైడ్స్ షాపుల యజమానులు రైతుల నుంచి నేరుగా తక్కువ ధరకు ధాన్యం సేకరించి వారి పేర్లతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి అధిక లాభాలు పొందేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ మేరకు ముందస్తుగా ఆయా గ్రామాలకు కేటాయించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారికి అనుకూల వారికి ఇప్పించే ప్రక్రియలో నిమగ్నమైనట్లు విస్వసనీయ సమాచారం. రైతులకు పెట్టుబడి సాయం చేసిన వ్యాపారులు కొద్ది సంవత్సరాలుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కుమ్మక్కై రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని వారి కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తుల పేరుతో కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి రూ.లక్షల్లో సొమ్ముచేసుకున్నట్లు సమాచారం. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను నిబంధనల ప్రకారంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలను అప్పగించి రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ విజయభాస్కర్


పంకెనలోని పల్లె ప్రకృతి వనాన్ని సందర్శిస్తున్న విజయభాస్కర్

పలిమెల: ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహారం అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ విజయభాస్కర్ అధికారులకు సూచించారు. శుక్రవారం పలిమెల మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలిమెల గ్రామపంచాయతీని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంరతం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. పలిమెల ఎంపీయూపీఎస్ పాఠశాలలో నూతనంగా నియమించబడిన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆయన ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలలోని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

పల్లె ప్రకృతి వనాల్లో కలుపు తీయాలి

మండలంలోని పంకెన గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించిన మండల స్పెషల్ ఆఫీసర్ విజయభాస్కర్ చెట్ల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి కలుపుతీయాలని సిబ్బంది సూచించారు. డ్రైడే కార్యక్రమంలో పాల్గొని ప్లాస్టిక్ వేరు చేసే షెడ్‌ను సందర్శించి కంపోస్ట్ ఎరువు తయారీని పరిశీలించారు. అనంతరం పంకెనలోని కేజీబీవీ సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ ప్రకాశ్, ఏపీఓ సునీత, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


సరోజన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీతక్క

ములుగు రూరల్: మండలంలో పాల్‌సాబ్‌పల్లికి చెందిన పత్తి శ్రీకాంత్, దామెర సరోజన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను రాష్ట్ర పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి, శిశు, సంక్షేమశాఖ మంత్రి సీతక్క శుక్రవారం పరామర్శించారు. ములుగు సపాయివాడకు చెందిన ఎంపెల్లి సారయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరమార్శించి ఆర్థిక చేయూతనందించారు. ఆమె వెంట గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, వంగ రవియాదవ్, ఒజ్జల కుమార్, మాజీ ఎంపీటీసీ మావురపు తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బోయిని రాజు, ఓంప్రకాశ్, గండె శ్రీను, నల్లెల్ల భరత్, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని వినతి


వంట పదార్థాలను పరిశీలిస్తున్న కేశవరావు

వెంకటాపురం(ఎం): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంటును వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ సదానందానికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి, నాయకులు రవితేజ, భరత్, రాము, సిద్ధూ, రాజు, పవన్, ఆదిత్య, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీమ్ జీవితం స్ఫూర్తిదాయకం


భీమ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కాటారం: కొమురంభీం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని నాయకపోడు సేవా సంఘం మండల అధ్యక్షుడు రాంనేని వెంకట్రాజం అన్నారు. మహాముత్తారం మండలం యామన్‌పల్లిలో కొమురం భీమ్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. కొమురం భీమ్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రాజం మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీమ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకపోడు సేవా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కండెల రాంచందర్, టీపీసీసీ సభ్యుడు బెల్లంకొండ కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పక్కల సడువలి, తుడుందెబ్బ నాయకుడు పిల్లి నాగయ్య, నాయకులు దేవరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి


సర్వేను పరిశీలిస్తున్న సంజీవరావు

కాటారం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ సర్వే మండలంలో త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌లో కొనసాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి పరిశీలించారు. సర్వే కొనసాగుతున్న తీరు, నమోదు చేసుకుంటున్న వివరాలను సర్వే బృందం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సర్వే బృందానికి పలు సూచనలు చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పక్కాగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రాజేశం, పంచాయతీ కార్యదర్శులు షగీర్ ఖాన్, రాజశేఖర్, శ్రీనివాస్, గంగాధరన్, కుమారస్వామి, సురేశ్, కృష్ణవేణి, ప్రసన్న, రెవెన్యూ, ఇరిగేషన్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు


చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

వాజేడు: మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. తాగు నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడంతో పాటు రహదారులను శుభ్రం చేశారు. చెత్త తొలగింపు పనులు చేయడంతో పాటు గుమ్మడిదొడ్డి పాఠశాలలో డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులను, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

గణపురం: విద్యార్థులు విద్యతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, కళలు, క్రీడా రంగాలలో నైపుణ్యత సాధించాలని గణపురం ఎంఈఓ ఊరుగొండ ఉప్పలయ్య అన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కళా ఉత్సవం 2024 పోటీలలో భాగంగా గణపురం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన జగదీశ్ రాష్ట్ర స్థాయి డ్రాయింగ్ పోటీలకు ఎంపిక కావడంతో పాటు మరో విద్యార్థి షారుఖ్ ఎస్‌జీఎఫ్ అండర్ 17 వాలీబాల్ ఉమ్మడి జిల్లాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను తెలంగాణ ఆల్ పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోనాల రాజమౌళి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులతో పాటు వ్యాయమ ఉపాధ్యాయురాలు కోసరి సరిత, డ్రాయింగ్ మాస్టర్ (పీటీఐ) తంగళ్లపెల్లి వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, హెచ్‌ఎంలు దేసు సతీష్, దూలం కుమారస్వామితో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

చిట్యాల: నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరమని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటరావుపల్లి, చింతకుంట రామయ్యపల్లి గ్రామాలకు చెందిన చిలుకల ఐలుకొమురు, ఏనుగు పుష్పకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిలుకల రాయకొమురు, నాయకులు రవీందర్, రాజమౌళి, నటరాజ్, వేణు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

టేకుమట్ల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ ఇంతియాజుద్దీన్ ఇటీవల సీఐడీ వరంగల్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఆయనను ఎస్సై గోగికారి ప్రసాద్ శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాలుగా నిజాయితీగా విధులు నిర్వహించిన ఏఎస్‌ఐ ఇంతియాజుద్దిన్ సేవలను ఎస్సై కొనియాడారు. ఏఎస్‌ఐ అమరేందర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ మహేందర్, లవకుమార్, లత, స్వప్న, హోంగార్డ్ దేవేందర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులు

రేగొండ(కొత్తపల్లిగోరి): ఎమ్మార్పీఎస్ కొత్తపల్లిగోరి మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దైనంపల్లి వెంకన్న, ఉపాధ్యక్షులుగా కాడపాక రమేశ్, కోలేపాక శ్రీనివాస్, జూపాక శ్రీనివాస్, కార్యదర్శిగా బోయిని సదయ్య, ప్రచార కార్యదర్శిగా ఈర్ల రాజేష్, సంయుక్త కార్యదర్శిగా బొమ్మకంటి చిరంజీవి, కోశాధికారిగా పుల్యాల రాంబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగొండ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్, నాయకులు ఈర్ల శ్యామ్, సదానందం, రాంబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చివరి దశకు నిర్మాణ పనులు


నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయం

- త్వరలో పాఠకులకు అందుబాటులో గ్రంథాలయ భవనం

మల్హర్: మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. గ్రంథాలయ భవన నిర్మాణం కోసం ఎఫ్‌డీడబ్ల్యూ నిధులు ద్వారా ప్రభుత్వం రూ.25 లక్షల నిధులను మంజూరు చేసింది. గత మార్చి నెలలో పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఏడు నెలల కాలంలో ఎట్టకేలకు చిన్న, చిన్న పనులు మినహ భవన నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. మిగిలిన పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం భవనం ప్లాస్టరింగ్ పనులు పూర్తయ్యాయి. టైల్స్, డోర్స్, కలర్స్ తదితర చిన్న పనులు చేపట్టాల్సి ఉంది.

ఏళ్లుగా గ్రామ పంచాయతీ భవనంలోనే..

గ్రంథాలయం 1989 సంవత్సరం నుంచి పాత తాడిచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఇరుకు గదిలోనే కొనసాగుతోంది. ఈ భవనంలో పట్టుమని పది మంది కూడా కుర్చోరాదు. దీంతో నిరుద్యోగులు, విద్యార్థులు, పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి వచ్చిన పాఠకులు స్థలం లేక గ్రామ పంచాయతీ ఆవరణలో ఆరుబైట కూర్చొని చదువుకునే వారు.

త్వరలోనే అందుబాటులోకి..



నూతన గ్రంథాల భవనం నిర్మాణం పనులు చిన్న, చిన్న పనులు మినిహా పూర్తి కావచ్చింది. 35 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతోంది. నెల రోజుల లోపు గ్రంథాలయం అందిబాటులోకి వస్తుంది. పాఠకులకు ఇబ్బందులు తప్పుతాయి.

– ప్రభాకర్, గ్రంథాలయ ఇన్‌చార్జ్, తాడిచర్ల

రెండు లారీలు ఢీ.. డ్రైవర్లకు గాయాలు



వాజేడు: ఎదురెదుగా వస్తున్న రెండు ఇసుక లారీలు ఢీకొని డ్రైవర్లకు గాయాలైన సంఘటన మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. లారీ ఇసుక నింపుకొని వస్తుండగా మరో లారీ ఇసుకను నింపుకోవడానికి వెళ్తుంది. ఈ రెండు లారీలు గుమ్మడిదొడ్డి సమీపంలో 163 నంబర్ జాతీయ రహదారిపై వేగంగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో ఒక లారీ నుజ్జు నుజ్జు కాగా మరో లారీ అద్దాలు పగిలి పోవడంతో పాటు ఇంజన్ దెబ్బతింది. కాగా, ఇద్దరు లారీ డ్రైవర్లతో పాటు మరో డ్రైవర్‌కు కూడా తీవ్రంగా గాయాలైనట్లు తెలిసింది. కాగా వారిని వైద్యం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.